నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


రామానుజపురంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సతీశ్ జిరాక్స్ సెంటర్

# కేసీఆర్ అభిమానికి ఎమ్మెల్సీ కవిత చేయూత

- జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు సహకారం
- నేడు ప్రారంభించనున్న కవిత, ఆ తర్వాత భూపాలపల్లిలో పర్యటన

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వీరాభిమానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేయూతనందించి మరోసారి తన గొప్ప మనస్సు చాటుకున్నారు. దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చెందిన చిర్రా సతీశ్ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వీరాభిమాని. అయితే చిన్నప్పటి నుంచే అతడికి వినికిడి సమస్య ఉంది. డిగ్రీ పూర్తి చేసిన సతీశ్ తనకు జిరాక్స్ మిషన్, ల్యాప్‌టాప్ ఇప్పిస్తే స్వయం ఉపాధి పొందుతానని ఇటీవల కేసీఆర్ పుట్టినరోజున ఎమ్మెల్సీ కవితకు మెస్సేజ్ పెట్టాడు. వెంటనే స్పందించిన ఆమె.. అందుకు అవసరమైన సామగ్రి సమకూర్చారు. సోమవారం మహబూబాబాద్ పర్యటనలో భాగంగా ఉదయం 9:30 గంటలకు సతీశ్ జిరాక్స్ సెంటర్‌ను కవిత ప్రారంభించనున్నారు. 10గంటలకు మరిపెడ మండలం చిల్లంచర్లలో జాగృతి అధ్యక్షురాలు మారిపల్లి మాధవి గృహప్రవేశం, 11గంటలకు కురవి వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం, 12:30 గంటలకు అన్నారంలోని సింగర్ ప్రసాద్ ఇంటి సందర్శన, ఒంటి గంటకు కేసముద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను సందర్శించి 3గంటలకు భూపాలపల్లి జిల్లాకు వెళ్లనున్నారు.

# వివాహ వేడుకలో క్రికెట్ మ్యాచ్

## భారీ స్క్రీన్‌లో ఆసక్తిగా వీక్షించిన బంధుగణం


పెళ్లి వేడుకల్లో ఇండియా – పాక్ క్రికెట్ మ్యాచ్ వీక్షిస్తున్న బంధువులు

**హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 23 : ఆదివారం హనుమకొండలోని ఓ వివాహ వేడుకలో ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్‌పై ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్‌ను పెళ్లికొచ్చిన వారు ఆసక్తిగా తిలకించారు. వధూవరులను ఆశీర్వదించిన తర్వాత ఇలా సరదాగా భోజనాలు చేస్తూ లైవ్ క్రికెట్ చూశారు. టీమిండియా విజయం సాధించడంపై హర్షం వ్యక్తంచేశారు.**

## మెము రైలు రద్దు..

రెండున్నరేళ్ల క్రితం మెము రైలును రద్దుచేయగా, పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంతో సింగరేణికి ఇటీవల హాల్టింగ్‌ను ఎత్తివేశారు. దీంతో ఈ రైళ్లలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణిలో వెళ్లాలంటే అనివార్యంగా వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తున్నదని వాపోతున్నారు. తమ ఇబ్బందులను గమనించి రద్దు చేసిన మెము, హాల్టింగ్ ఎత్తివేసిన సింగరేణిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. విజయవాడ–బల్లార్ష సెక్షన్‌లో ఇరువైపులా ఏమైనా రైళ్లు వెళితే లైన్ క్లియర్ అయ్యే వరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, గూడ్స్ రైళ్లను ఈ స్టేషన్‌లో అధికారులు నిలుపుతున్నారు. భవిష్యత్తులో ఇక్కడ ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం స్టేషన్ ఏర్పాటై ఢిల్లీ, చెన్నైల మధ్య నడిచే ప్రయాణికుల రైళ్లు ఆగుతాయని భావించిన ఇక్కడి ప్రజల ఆశలు అధికారులు తీసుకున్న నిర్ణయంతో ఆవిరయ్యాయి.




- మెము రైలు రద్దు.. సింగరేణి హాల్టింగ్ ఎత్తివేతతో వెలవెల
- సుదూర ప్రాంతాలు వెళ్లే రైళ్లు నిలిపేందుకే ప్రాధాన్యత
- రైళ్లను పునరుద్ధరిస్తూ.. ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని ప్రయాణికుల డిమాండ్


కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్‌లో నిలిచిన స్టాఫ్‌లేని, గూడ్స్ రైళ్లు

# సౌకర్యాలున్నా నిరుపయోగమే..!

## అలంకార ప్రాయంగా కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్

### ఉపాధి కోల్పోయాం



టౌన్ స్టేషన్‌లో మెము రైలు రద్దు, సింగరేణి హాల్టింగ్ ఎత్తివేతతో చాలా మంది ఆటో డ్రైవర్లం ఉపాధి కోల్పోయాం. టౌన్ స్టేషన్ ఆటో అడ్డా నుంచి దాదాపు యాభై మందిమి ఆటోల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తూ వచ్చే డబ్బులతో జీవనం సాగించేవాళ్లం. ఇప్పుడు మా పరిస్థితి చాలా కష్టంగా మారింది. ప్రస్తుతం రోడ్లపై ఆటోలు ఎక్కేటోళ్లు కరువైండ్రు.

– భుక్యా శంకర్ నాయక్, ఆటో యూనియన్ నాయకుడు, కాజీపేట

### ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలి..



కాజీపేట టౌన్ స్టేషన్ ప్రాంతంలో ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి. ఢిల్లీ–చెన్నై మార్గంలో నడిచే రైళ్లు కాజీపేటకు రాకుండా పోతున్నాయి. హనుమకొండ జిల్లా పరిధిలో నిట్, కేయూ, జిల్లా కోర్టు, కలెక్టర్ కార్యాలయం, కేఎంసీ, ఐటీ కంపెనీలు, పేరొందిన దర్గా, చర్చి, దేవాలయాలతో పాటు దవాఖానలు, విద్యా సంస్థలు, రైల్వే ఈఎల్ఎస్, డీఎల్ఎస్, వ్యాగన్ తదితర సంస్థలున్నాయి. ఎంపీలు, మంత్రులు చొరవ తీసుకొని అన్ని విధాలా సౌకర్యంగా ఉన్న కాజీపేట టౌన్ స్టేషన్‌ను ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం స్టేషన్‌గా తీర్చిదిద్ది, అన్ని రైళ్లు ఆగేలా చర్యలు చేపట్టాలి.

– శివకుమార్, కాజీపేట


ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్

కాజీపేట, ఫిబ్రవరి 23 : ఉదయం, సాయంత్రం ప్రయాణికులతో సందడిగా ఉండే కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ వెలవెలబోతున్నది. ఇక్కడ అన్ని సౌకర్యాలున్నప్పటికీ రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయంతో కొంతకాలంగా నిరుపయోగంగా మారింది. ఈ స్టేషన్‌లో నిలిచే మెము రైలును రద్దు చేయడం, సింగరేణి హాల్టింగ్‌ను ఎత్తివేయడంతో ప్రస్తుతం బోసిపోయింది. గతంలో కాజీపేట మీదుగా బల్లార్ష, విజయవాడ, సికింద్రాబాద్‌కు నడిచే ప్రతి రైలు కాజీపేట జంక్షన్‌కు వచ్చిన తర్వాతనే గమ్యస్థానాలకు వెళ్లేవి. కాజీపేట జంక్షన్ మీదుగా రైళ్ల సంఖ్య పెరిగి, స్టేషన్‌పై భారం ఎక్కువ కావడంతో అప్పటి సీమాంధ్ర రైల్వే అధికారులు ఫాతిమానగర్ బ్రిడ్జి కింద నుంచే వరంగల్ స్టేషన్‌కు రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో అప్పటి బీఆర్ఎస్ హనుమకొండ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు ముఖ్య కూడలిగా ఉన్న కాజీపేట జంక్షన్‌కు భవిష్యత్‌లో ప్రాముఖ్యత తగ్గుతుందని గుర్తించి టౌన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డుపై ఒత్తిడి పెంచారు. దీంతో రైల్వేబోర్డు దిగొచ్చి 2007లో కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేసి సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్‌ను దీని మీదుగా నడిపారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు పెద్దపల్లి – మహబూబాబాద్ – పెద్దపెల్లి మధ్య మెము రైలును ప్రవేశ పెట్టి, ఆపై విజయవాడ వరకు పొడిగించారు. ప్రతిరోజు ఈ స్టేషన్‌లో సింగరేణి, మెము రైళ్లు ఆగడం, వీటికి జనరల్ బోగీలుండడంతో ప్రతిరోజు సామాన్య ప్రజలు, దినసరి కూలీలు ప్రయాణించేవారు.


దేవాదుల–4ఎల్ కాల్వను పరిశీలించి నీటి విడుదల గురించి రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

# మూడు రోజుల్లో నీళ్లివ్వకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తా

**కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది**

- కేసీఆర్ పాలనలో ఎండాకాలంలోనూ చెరువులు మత్తళ్లు దూకాయి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, ఫిబ్రవరి 23: మూడు రోజుల్లో గోదావరి జలాలు విడుదల చేసి పంటలకు నీరందించాలని లేకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయని, ఆ పార్టీ వచ్చి కరువును తెచ్చిందని మండిపడ్డారు. ఆదివారం పాలకుర్తి మండలం శాతాపురంలో దేవాదుల–4ఎల్ కాల్వ ద్వారా గోదావరి జలాలు రావడం లేదని రైతులు ఎర్రబెల్లి దృష్టికి తీసుకురాగా పరిశీలించారు. అనంతరం దేవాదుల ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మూడు రోజుల్లో నీళ్లు వదలాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో చెరువులు మత్తళ్లు దూకాయని గుర్తుచేశారు. ప్రతి చెరువును గోదావరి జలాలతో నింపడంతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. గోదావరి జలాలు విడుదల చేయకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెయ్యి ఎకరాల్లో వరి ఎండుతున్నదన్నారు. గతంలో రైతన్నల ముఖాల్లో చిరునవ్వులు చూశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధుకు రాంరాం చెప్పారని యూరియా కొరత ఏర్పడిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచుతుందన్నారు. త్వరలోనే ప్రజలు రైతులు కాంగ్రెస్‌ను ఉరికించి కొడతారని హెచ్చరించారు. ప్రస్తుత పాలకుల అసమర్థ విధానాలతో పాటు ముందుచూపు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు వరి వేయవద్దు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గోదావరి జలాలు విడుదల చేయకపోవడంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయన్నారు. అనంతరం వావిలాలలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలె సుందర్, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, గంట పద్మ భాస్కర్, బీరెల్లి రవివర్మ, ఏలూరు కృష్ణమూర్తి, బానోత్ మహేందర్, వెంకట్, నల్లపు అశోక్, కోల రాజు ఉన్నారు.

## ఎండిన గుడి చెరువు
# రైతన్న గుండె బరువు

- పంటలకు నీళ్లందక రైతుల ఆందోళన
- బచ్చన్నపేటలో అడుగంటిన భూగర్భ జలాలు


నేడు నీరు లేక ఎండిపోయి బోసిపోయిన గుడి చెరువు


ఎండిపోయిన అలింపూర్ చెరువు


నాడు నిండుకుండలా దర్శనమిస్తున్న గుడి చెరువు

నాడు గోదావరి జలాలతో కళకళలాడిన చెరువులు, కుంటలు నేడు ఎండిపోయి వెలవెలబోతున్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపారు. దీంతో రైతన్నలు రెండు పంటలు సమృద్ధిగా పండించారు. భూగర్భ జలాల్లో నీటిమట్టం పెరిగి బోర్లు పుష్కలంగా పోశాయి. దీనికి తోడు రైతుబంధు సాయం అందడంతో వ్యవసాయం పండుగలా మారింది. ఏడాది క్రితం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గోదావరి జలాలను ఆయా గ్రామాల్లోని చెరువులకు తరలించలేదు. దీంతో ఆలింపూర్, బచ్చన్నపేట, పోచన్నపేటతో పాటు పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు అడుగంటి పొలాలకు సాగునీరు అందక, బోర్ల నుంచి నీరు రాక వరి పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బచ్చన్నపేట మండలం నుంచి ఆలేరుకు ఎంచక్కా గోదావరి జలాలను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తరలించుకుపోతున్నా, స్థానిక కాంగ్రెస్ నేతలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అన్ని గ్రామాల చెరువులను గోదావరి జలాలతో నింపి అన్నదాతకు అండగా నిలువాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

– బచ్చన్నపేట, ఫిబ్రవరి 23

కురవిలో అకాల వర్షానికి మిరప కల్లంపై పరదాలు కప్పుతున్న రైతులు


# అకాల వర్షం.. రైతన్న ఆగం

- కల్లాల్లో తడిసిన మిర్చి
- పంటను కాపాడుకునేందుకు తంటాలు

కురవి/బయ్యారం, ఫిబ్రవరి 23 : మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం పడడంతో రైతులు ఆగమయ్యారు. కల్లాల్లో ఉన్న మిర్చిని కాపాడుకునేందుకు పాట్లు పడాల్సి వచ్చింది. బయ్యారం మండలకేంద్రంతో పాటు కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో వర్షం మోస్తరు వాన పడింది. మిర్చి పంటను తెంపి కల్లాల్లో ఆరబెట్టిన రైతులు ఆందోళన చెందారు. ఇప్పటికే బూజు తెగుళ్లతో నష్టపోతున్న మిర్చి రైతు.. ఓ వైపు మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతుంటే మరో రూపంలో వాతావరణ పరిస్థితులు వెంటాడుతున్నాయి. కల్లాల్లో మిర్చిపై వెంటనే రైతులు పరదాలు కప్పుకొన్నారు. కొందరి మిర్చి పంట స్వల్పంగా తడిసింది.


బయ్యారం : మిర్చి తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతులు

# నాటకరంగాన్ని కాపాడుకోవాలి

- ప్రముఖ సినీ నటుడు సుబ్బరాయ శర్మ
- కాళోజీ కళాక్షేత్రంలో నాటకోత్సవాలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాహితీవేత్తలు


నాటికలో సన్నివేశం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 23: కావ్యాల్లో నాటక రంగం గొప్పదని, అందుకే కావ్యేషు నాటకం రమ్యమని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కళాకారులు, సాహితీవేత్తలపై ఉందని ప్రముఖ సినీ, బుల్లితెర నటుడు సుబ్బరాయ శర్మ అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర చలనచిత్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలను ఆదివారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహర బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాటి నాటిక ప్రదర్శనలో విజ్ఞానం, వినోదంతో పాటు జీవన విధానం, మార్చుకోవాల్సిన తీరు వివరించే వారన్నారు. పాతికేళ్లుగా సాంస్కృతిక నాటకోత్సవాలను నిర్వహిస్తున్న సహృదయ సంస్థ నిర్వాహకులను అభినందించారు. అలాగే బీఎంరెడ్డి కళాక్షేత్రాన్ని సాంస్కృతిక సంస్థలకు ఉచితంగా ఇవ్వడం ద్వారా పేద కళాకారుల ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కుందావఝ్ఝుల కృష్ణమూర్తి, కార్యదర్శి వనం లక్ష్మీకాంతారావు, ప్రాయోజకులు పాలాయి శరత్ కల్యాణ్, సంతోష్‌కుమార్, సభ్యులు న్యాలకొండ భాస్కర్‌రావు, ఎన్‌వీఎన్ చారి, బీ పురుషోత్తమరావు, కళా రాజేశ్వర్‌రావు, సీతావెంకటేశ్వర్లు, జూలూరు నాగ రాజు, ఆకుల సదా నందం, ఒడపల్లి చక్రపాణి, మాడిశెట్టి రమేశ్, కవులు, కళాకారులు, నాటక అభిమానులు పాల్గొన్నారు.

# పెద్దపులి పయనమెటు?


- రోజుకో చోట సంచారం
- తాజాగా మహదేవపూర్ నుంచి పలిమెల అడవుల్లోకి
- తాడిచర్లలో ఆవు మృతి


అడవి జంతువు దాడిలో మృతి చెందిన ఆవు

మహదేవపూర్(కాటారం)/మల్హార్, ఫిబ్రవరి 23 : కొద్దిరోజులుగా భూపాలపల్లి జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. మహదేవపూర్, కాటారం అటవీ ప్రాంతాల్లో రోజుకో చోట తిరుగాడిన ఆనవాళ్లు కనిపించడంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటివరకు పలుచోట్ల పెద్దపులి పాదముద్రలను గుర్తించిన అధికారులు దాని జాడ కోసం అన్వేషిస్తున్నారు. తాజా ఆదివారం మహదేవపూర్ మండల పరిధిలోని బొమ్మాపూర్ అటవీ క్షేత్రం నుంచి రాపల్లికోట, ఎన్కపల్లి మీదుగా పలిమెల అడవుల్లోకి ప్రవేశించిందని ఎఫ్ఆర్‌వో రవి తెలిపారు. ఇదిలా ఉండగా మల్హార్ మండలం తాడిచెర్ల పరిధిలోని కాపురం అటవీ ప్రాంతంలో మేత కోసం వెళ్లిన ఆవు మృత్యువాతపడడం, దాని మెడపై గాట్లు ఉన్నందున పెద్దపులే దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. కాగా ఆవుపై పులి దాడి చేసినట్లు నిర్ధారించలేమని సోమవారం సందర్శిస్తామని రేంజర్ రాజేశ్వరరావు తెలిపారు.

## నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం

- కళ తప్పిన పల్లె ప్రకృతి వనం
- నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు
- నిర్వహణ పట్టని అధికారులు


వడ్లకొండలో పల్లె ప్రకృతి వనంలో వాకింగ్ ట్రాక్‌లో చెత్తాచెదారంతో దర్శనమిస్తున్న వనం

*మొన్నటివరకు పచ్చని చెట్లు, తీరొక్క పూలతో ఆహ్లాదం పంచిన పల్లె ప్రకృతి వనాలు ఇప్పుడు అధ్వానంగా కనిపిస్తున్నాయి. 'తెలంగాణకు హరితహారం'లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో గత బీఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా ఈ పల్లె పార్కులను ఏర్పాటుచేసింది. వివిధ రకాల పూలు, పండ్ల మొక్కల పెంచడమే గాక పిల్లలు, పెద్దలు సాయంత్రం వేళ ఉల్లాసంగా గడిపేందుకు వాకింగ్ ట్రాక్‌లు, ఆడుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించడం కేంద్రం దృష్టిని ఆకర్షించి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ సర్కారు పాలనలో అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో మొక్కలు, చెట్లన్నీ ఎండిపోయి వనాలన్నీ కళ తప్పాయి. జనగామ మండలంలోని వడ్లకొండ, పెంబర్తిలో ఇలా నీళ్లు అందక చెట్లన్నీ ఎండిపోయి, ఆవరణలో చెత్తాచెదారం నిండిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఇక్కడే జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కారణంగా పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.*

*– జనగామ రూరల్, ఫిబ్రవరి 23*